క్లుప్తంగా

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం



మాట్లాడుతున్న సన్మాన గ్రహీతలు

సీతానగరం: వృద్ధాప్యంలో అవసరాన్ని గుర్తించి వంశోద్ధారకులు వారికి అండగా ఉండి, సేవలందించడానికి సమాయత్తం కావాలని ఆర్డీఓ కె. హేమలత కోరారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్వతీపురం ఆర్డీఓ కార్యాలయం ఆవరణలో ఆదివారం నియోజకవర్గ స్థాయి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రీసర్వే డీటీ చిట్టెమ్మ ఆధ్వర్యంలో సీతానగరం మండలానికి చెందిన వృద్ధులను ఆర్డీవో కె.హేమలత శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఓ వృద్ధుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇజ్జాడ సింహాచలం మాట్లాడుతూ మాలాంటి వృద్ధులను గౌరవించడం పలువురికి స్ఫూర్తిదాయకమన్నారు. గుచ్చిమి పెదభోగిలి, కాలనీ గ్రామాలకు చెందిన వృద్ధులు పాల్గొన్నారు.

మహిళలు మొబైల్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సంతోదోషి

సీతానగరం: మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించడానికి ప్రభుత్వం రూపొందించిన దిశ యాప్‌ను ప్రతి ఒక్క మహిళ తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని దిశ మహిళా ఎస్సై సంతోషి పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట మహిళా కేజీబీవీ విద్యాలయంలో దిశయాప్ వినియోగం మొబైల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయడంపై విద్యార్థినులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై కె.నీలకంఠం పాల్గొన్నారు.

అలరించిన నాటక ప్రదర్శనలు



నాటకంలో ఓ సన్నివేశం

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి కూడలిలో ఉన్న సత్యసాయి లాష్ పాఠశాలలో మేరంగి నాటక పరిషత్ ఆధ్వర్యంలో నాటక పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన చీకటి పువ్వు, కెరటాలు, మలిసంధ్య నాటకాలు అలరించాయి. రోజుకు మూడు నాటకాలు చొప్పున వేయిస్తున్నామని పరిషత్ అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు తెలిపారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు ఎం.భూపాల్ రెడ్డి మాట్లాడుతూ నాటకరంగం కనుమరుగైపోతుందన్న సమయంలో మేరంగి నాటక పరిషత్ ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. నాటకాలు, నాటికల ద్వారా తక్కువ సమయంలో ఆనందం, సందేశం ప్రజలకు ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు పారినాయుడు, కవులు తుంబలి శివాజీ, సిరికి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై అవగాహన

భామిని: స్థానిక కేజీబీవీ(కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం)లో దిశ యాప్ వినియోగం, దాని ఉపయోగాలపై ఆదివారం అవగాహన కల్పించారు. పార్వతీపురం మన్యం జిల్లా దిశ ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ ఎప్పుడు ఏ రకమైన ఆపద వచ్చినా రక్షణ కోసం దిశ యాప్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. యాప్‌ను ఆశ్రయించిన కొన్ని క్షణాల్లోనే పోలీసులు వచ్చి, రక్షణ కల్పిస్తారన్నారు. ఎక్కడైనా ఎవరైనా ఎవరి చేతనైనా ఇబ్బంది పడినా, బాల్యవివాహాలు జరిగినా, బాలకార్మికులున్నా సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరి స్మార్ట్ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. అనంతరం దాని వినియోగం వివరించారు. కార్యక్రమంలో బత్తిలి ఏఎస్‌ఐ గురుమూర్తి, ఎస్ఓ బి.శారద, మహిళా పోలీస్ చందన పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

పాలకొండ రూరల్: బస్సులు నడిపేటప్పుడు డ్రైవర్లు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని, అలా అయితేనే ప్రమాదాలను కొంత వరకు నివారించవచ్చని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో బస్సు టైర్ల సంరక్షణ పక్షోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు తీసేముందు బస్సు ఏ స్థితిలో ఉందో తెలుసుకోవాలన్నారు. బ్రేకులు, టైర్లు బాగున్నాయా లేదా అని చూసుకోవాలన్నారు. రోజులో రెండు సార్లు టైర్లలో గాలి నింపించాలన్నారు. ప్రతిరోజూ టైర్ల మధ్య ఇరుక్కున్న రాళ్లను తొలగించాలన్నారు. వీలైనంత వరకు సడన్ బ్రేకులు వేయకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. అనంతరం టైర్ల మైలేజీని పెంచే ప్రతిజ్ఞ డ్రైవర్లతో చేయించారు.

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి



పార్వతీపురం టౌన్: కాలువలు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురం టౌన్: స్వచ్ఛత హీ సేవాలో పాల్గొన్న ఎస్‌బీఐ సిబ్బంది

పార్వతీపురం టౌన్: గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం పార్వతీపురం మండలం పెద్దబొండపల్లి గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని కాలువలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశప్రధాని మోదీ పిలుపుమేరకు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను నిత్యం ప్రరిశుభ్రంగా ఉంచుకునేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలనాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవలో ఎస్‌బీఐ

కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక సేవల శాఖ సూచన మేరకు పార్వతీపురం భారతీయ స్టేట్ బ్యాంక్ సిబ్బంది ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణ రైల్వేస్టేషన్ పరిధిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఏఏ హసీబ్, చీఫ్ మేనేజర్ ఎం.రవిశంకర్ ప్రసాద్, ఎల్‌డీఎం జేఎల్‌ఎస్ మూర్తి, ఇతర ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొని రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న వ్యర్థపదార్థాలను శుభ్రం చేసి ప్రజలకు శుభ్రత గురించి, జన సురక్ష బీమా పథకాల గురించి అవగాహన కల్పించారు. టౌన్ రైల్వే స్టేషన్ మాస్టర్ మహేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

స్వచ్ఛతలో భాగస్వాములు కావాలి

సీతానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛత హీ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, స్వచ్ఛత హీ సేవలతోనే పరిసరాలు బాగుంటాయని, ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని జాయింట్ కలెక్టర్ రోణంకి గోవిందరావు అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదభోగిలిలో సర్పంచ్ జె.తేరేజమ్మ అధ్యక్షతన స్వచ్ఛతా హీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పరిసరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు దోహద పడుతున్నాయన్నారు. అలాగే రోడ్లపై ఊడ్చిన చెత్తను శుభ్రం చేయడం వల్ల పంచాయితీలకు ఆర్థిక వనరులు చేకూరుతాయన్నారు. నిత్య జీవితంలో శ్రమదానం చేయడం వల్ల ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి. శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ ఎంబాబ్జీ మాట్లాడారు. మండలంలోని అన్నిగ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

మక్కువలో..

మక్కువ: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అధికారులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. మండలకేంద్రం మక్కువలో సీఆర్‌పీఎఫ్ బలగాలు రహదారులను శుభ్రంచేసి, చెత్తను పోగుచేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సీఆర్‌పీఎఫ్ బలగాలతో చీపురుపట్టారు. కోన, గోపాలపురం, ఎస్.పెద్దవలస, మక్కువ తదితర పంచాయతీల్లో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అధికారులు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి, వీధులన్నీ శుభ్రంచేశారు.



పెదభోగిలిలో చెత్తను చీపురుతో ఊడుస్తున్న జేసీ గోవిందరావు, ప్రజాప్రతినిధులు



మక్కువ ప్రధానరహదారిలో చెత్తను తొలగిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు, రంగునాయుడు



బలిజిపేట: వీధులు శుభ్రం చేస్తున్న సర్పంచ్ రాఘలత



మక్కువ: ర్యాలీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు

బలిజిపేటలో..

బలిజిపేట: గ్రామాల్లో పరిశుభ్రత పాటించి మన ఆరోగ్యాన్ని కాపాడుకుందామని బలిజిపేట సర్పంచ్ రాఘలత కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో నిర్వహించారు. అందులో భాగంగా మండల కేంద్రంలో సర్పంచ్ రాఘలత వీధులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో వీధులను మనమే పరిశుభ్రం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇంటింటికీ శుద్ధజలం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: గ్రామాల్లో ఇంటింటికీ శుద్ధ జలం అందిచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మండలంలోని పెద్దబొండపల్లి, మూడడ్లవలస గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం కింద అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పెదబొండపల్లి గ్రామంలో రూ.28.80 లక్షల అంచనా వ్యయంతో 40 కిలోలీటర్ల ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్, సూడిగాం పంచాయతీ మూడడ్లవలస గ్రామంలో రూ.15 లక్షల అంచనా వ్యయంతో 20 కిలోలీటర్ల ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్, గంగాపురం పంచాయతీలో రూ.12.80 లక్షల అంచనా వ్యయంతో 15 కిలోలీటర్ల ఓవర్ హెడ్ మంచినీటి ట్యాంక్ నిర్మాణం ప్రారంభించామన్నారు. మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకుల పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇంటింటి కుళాయి పైప్‌లైన్ ద్వారా తాగునీరు సకాలంలో అందించేలా చర్యలు చేపట్టామని చెప్పారు. గ్రామప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి ఇంటికి కూడా ఇంటింటి కుళాయి ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నామని తెలిపారు. అందులో భాగంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో లక్షలాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మంచినీటి కొరత రాకుండా పూర్తిస్థాయిలో ప్రజల అవసరార్థం అవసరమైన నీటి నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మంచినీటి కొరత లేకుండా చేయడమే ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, సర్పంచులు సవరాపు తవుడమ్మ, సింగిరెడ్డి శ్రీరాములు నాయుడు, ఆత్మ చైర్మన్ ఎంబ్రాపు తిరుపతిరావు, తహసీల్దార్ శివన్నారాయణ, ఆర్ డబ్ల్యూఎస్ డీఈ హనుమంతరావు, ఏఈ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎస్.రాజారావు, చందాన శివాజీ, మజ్జి శేఖర్, జి.దామోదర్ రావు, సింహాచలం, వి.కృష్ణ, వై శ్రీరాములు నాయుడు, పి శ్రీనివాసరావు, యోగిరెడ్డి రమణమూర్తి, కార్యకర్తలు, స్థానిక పెద్దలు, ప్రజలు, వలంటీర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధిపనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పింఛన్ల పంపిణీతో పండగ వాతావరణం



సీతానగరం: కె.సీతారాంపురంలో పింఛన్ కానుక ఇస్తున్న సీడీసీ మాజీ చైర్మన్ రామకృష్ణ



సీతానగరం:అప్పయ్యపేటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ బి.కుసుమ



బలిజిపేట: పెదపెంకిలో పింఛన్ అందిస్తున్న ఎంపీపీ నాగమణి



సీతానగరం:జీకేపురంలో పింఛన్ అందజేస్తున్న అధికారులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో లబ్ధిదారులకు జగనన్న పింఛన్ కానుకలు ఆదివారం ఉదయం నుంచే వలంటీర్లు, గృహసారథులు పంపిణీ చేయడంతో పండగ వాతావరణం నెలకొంది. పింఛన్ల పంపిణీలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సర్పంచ్‌లు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమం ఒక వరం

బలిజిపేట: జగనన్న ప్రభుత్వంలో నిరుపేదలకు సంక్షేమఫలాలు వరాలని ఎంపీపీ నాగమణి అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని 20సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా పెద పెంకి గ్రామంలో ఎంపీపీ నాగమణి లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎసార్ సీపీ నాయకుడు జగన్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌సీ తనిఖీ



ఎన్‌ఆర్‌సీని తనిఖీ చేస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: జిల్లా ఆస్పత్రిలో గల పోషకాహార పునరావాస కేంద్రా(ఎన్‌ఆర్‌సీ)న్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చుట్టుపక్కల ప్రాంతాలనుంచి వచ్చి ఇక్కడ అడ్మిట్ అయిన ఐదేళ్ల లోపు పిల్లల ఆరోగ్య వివరాల నమోదు రికార్డులు ఈ సందర్భంగా పరిశీలించారు. పది పడకల ఎన్‌ఆర్‌సీలో ప్రతి నెలా జరుగుతున్న అడ్మిషన్లు, డిశ్చార్జ్‌ల వివరాల్లో చేరేటప్పుడు వారి బరువు, ఆరోగ్యస్థితి ఆదేవిధంగా డిశ్చార్జ్ అయ్యేనాటికి వారి బరువు ఆరోగ్య స్థితి ఏ మేరకు మెరుగైనదీ తెలుసుకున్నారు. వారికిస్తున్న పోషకాహార మెనూను పరిశీలించారు. ప్రతి బెడ్ వద్ద ఉన్న చిన్నారి ఆరోగ్యాన్ని పరిశీలించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అందుతున్న వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. అక్కడ పిల్లల బరువును స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన ఐదేళ్ల లోపు పిల్లల్లో పోషకాహార లోపం, బరువుతక్కువ, ఎదుగుదల లోపం గల పిల్లలను అంగన్వాడీ సిబ్బంది, వైద్యసిబ్బంది గుర్తించి, ఎన్‌ఆర్‌సీలో కేంద్రాల్లో చేర్చాలని సూచించారు. ఎన్‌ఆర్‌సీలో న్యూట్రిషన్ కౌన్సిలర్, వైద్యులు, వైద్య సిబ్బంది ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, పిల్లల ఆరోగ్యం మెరుగుపడే వరకు (రెండు వారాల వరకు) ఉంచాలన్నారు. ఈ పరిశీలనలో సూపర్‌వైజర్ జయగౌడ్, వైద్యసిబ్బంది ఆశాజ్యోతి, దివ్యతేజ పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో గరుగుబిల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు, విశ్రాంత వీఆర్‌వోల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి అప్పలనాయుడు మృతి చెందారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు దంపతులు ఆదివారం ఆ గ్రామం వెళ్లి, మృతుని భార్య తవుడమ్మ, కుమారుడు వెంకటదామోదర్‌ను కలిసి, పరామర్శించారు. అనంతరం ఆయన మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీపీ ఉరిటి రామారావు, ఉప సర్పంచ్ తెర్లి ఎల్లం నాయుడు తదితరులు పాల్గొన్నారు. గొట్టివలస గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బోను కృష్ణమూర్తి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దంపతులు పరామర్శించారు.

సర్వే నిర్వహించిన వారందరికీ వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్‌ఎన్ ప్రసాద్

సీతానగరం: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భద్రత కల్పించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్యశిబిరానికి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖ అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన అంటిపేటలో సచివాలయ ఉద్యోగులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) పథకం ద్వారా స్పెషలిస్టులైన డాక్టర్లతో వైద్యపరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రోగులకు అవసరమైన వైద్యసేవలు ఉచితంగా అందించడానికి సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఉచితవైద్య శిబిరం తహసీల్దార్ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పారు. మాజీ జెడ్పీటీసీ అంబటి కృష్ణంనాయుడు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం అందరికీ ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా డాక్టర్లతో పాటు వ్యాధి నిర్ధారణకు అవసరమైన పనిముట్లు, వ్యాధుల నివారణకు మందులు సమకూర్చి ఇళ్లవద్దనే ఉచితంగా వైద్య సేవలందిస్తోందన్నారు. జగనన్న ప్రభుత్వానికి మనమంతా అండగా ఉండాల్సిన సమయం ఆసన్న మైంద న్నారు. అంటిపేటలో మంగళవారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రంవరకూ నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఉచితవైద్య శిబిరాన్ని ప్రజలంతా వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బి.తిరుపతిరావు, ఎంపీటీసీ ఎస్.నిర్మల, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుపతిరావు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శి శశిభూషణరావు, వైద్యారోగ్యశాఖ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర
- వైఎస్సార్‌సీపీ సమావేశంలో దిశానిర్దేశం

సాలూరు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని శివాలయం రోడ్డు సమీపంలో సీతారామధర్మశాల వద్ద నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారన్నారు.అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా చేయాలని ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. గ్రామాలు, పట్టణాల్లో జరిగే ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలకు ప్రజాప్రతినిధులు,నాయకులు కచ్చితంగా వెళ్లి ప్రజలకు వైద్యపరీక్షలు, చికిత్సలు అందేలా చూడాలని సూచించారు. ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి కార్యక్రమం విధివిధానాలను సమావేశంలో వివరించి దిశానిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

మండలాల వారీగా సమావేశాలు

దీనిపై ఈ నెల 3న మెంటాడ, 4న సాలూరు మున్సిపాలిటీ, 5న మక్కువ, 6న పాచిపెంట,7న సాలూరు మండలంలో ఈ సమావేశాలు నిర్వహించనున్నామని తెలిపారు. 8న మండల స్థాయి నాయకులతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి సమావేశం నిర్వహిస్తారని చెప్పారు. ఈ నెల 11నుంచి ఎందుకు ఆంధ్రాకి జగన్‌కావాలి కార్యక్రమం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, పాచిపెంట, మెంటాడ ఎంపీపీలు బద్నాన ప్రమీల, రెడ్డిసన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, నాయకులు మావుడిరంగునాయుడు, గొట్టాపు ముత్యాలునాయుడు,మావుడి శ్రీనువాసులు నాయుడు,సువ్వాడ భరత్ శ్రీనివాస్, రెడ్డి సురేష్, రెడ్డి సన్యాసినాయుడు,లెంక రత్నాకర్‌నాయుడు, పాచిపెంటవీరంనాయుడు,జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు,గిరిరఘు,దండి శ్రీనివాస రావు, రాంబాయి, రామారావు,సలాది అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.